క్లుప్తంగా

శిల్పారామంలో ఆట-పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక అఖిల్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వారు ప్రదర్శించిన కామెడీస్కిట్లకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. శిల్పారామం రాష్ట్ర ఏఓ మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించి సందర్శకులకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఓటు వేయాల్సిన బాధ్యత గురించి వివరించే పాటలకు చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు.

తల్లికి పాదపూజ



కాళ్లు కడిగి పూజ చేస్తున్న చిన్నారులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని కోదండ రామాలయంలో గ్రేటర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లికి పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పురాతన కోదండ రామాలయంలో గ్రేటర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లికి వందనం పేరిట తల్లులకు పాదపూజ నిర్వహించారు. తల్లికి తమ పిల్లలు సాంప్రదాయ బద్ధంగా కాళ్లు కడిగి ఆశీర్వాదం పొందారు. తల్లి ద్వారానే తమకు ఈ సమాజం పరిచయం అయిందని, తల్లి లేనిదే తాము లేమని, తల్లి పిల్లలపై చూపించే ప్రేమ అద్వితీయమైనదని చిన్నారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు సుబ్రమణ్యం, గోపాలక్రిష్ణ, సుధాకర్, శేఖ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

పులివెందుల టౌన్ : పట్టణంలోని రోటరీపురం 20వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు కొమ్మద్ది రసూల్, రహీం వారి కుటుంబ సభ్యులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, గాజుల బాబయ్య, కొమెర హరినాథ్, నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో చేరిన వీరికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రసూల్, రహీం కుటుంబ సభ్యులు, అన్వర్, మస్తాన్, శ్రీను, బాబాజీ, కిషోర్, రహంతుల్లా, మహమ్మద్, శ్రీధర్, బాబా ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడిర మణ, మాజీ కోఆప్షన్ మెంబర్ దస్తగిరివల్లి, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడే పోలింగ్
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



కమలాపురంలో ఎన్నికల సామగ్రి సరి చూసుకుంటున్న సిబ్బంది

కమలాపురం : అసెంబ్లీ, లోక్‌సభ సాధారణ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంతో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.

■ కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 27 రూట్లలో 251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓతో సహా ఆరు మంది సిబ్బంది విధులు నిర్వహించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,04,169 మంది ఓటర్లు ఉండగా అందులో 99,851 మంది పురుషులు, 1,04,284 మంది మహిళలు, 34 మంది ఇతరులు ఉన్నారు.

ఎన్నికల సామాగ్రి పంపిణీ

ఎన్నికలు నిర్వహించేందుకు సామాగ్రి పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. ఆర్‌ఓ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో, ఏఆర్‌ఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. మధ్యాహ్నం తర్వాత ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన బస్సుల్లో రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు, పోలీస్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు.

గట్టి పోలీస్ బందోబస్తు

కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సోమవారం జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నోడల్ అధికారి, డీఎస్పీ సుధాకర్ పర్యవేక్షణలో 1200 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ ఒకరు, ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 400 మంది సివిల్ పోలీసులు, 300 మంది కేంద్ర బలగాలు, 100 మంది తమిళనాడు బలగాలు, 200 మంది ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెన్నూరులో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

చెన్నూరు : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పార్లమెంటు, శాసనసభకు సంబంధించి చెన్నూరు మండల వ్యాప్తంగా 36 పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకే పోలింగ్ నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకునేందుకు సిబ్బంది తలమునకలయ్యారు.

■ చెన్నూరు మండల తహసీల్దార్ ఎస్. ప్రకాష్ బాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశర్మ ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

కమలాపురం నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు					
మండలం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కమలాపురం	59	19,932	21,251	17	41,200
చెన్నూరు	36	14,818	15,977	08	30,803
వల్లూరు	28	11,072	11,490	0	22,562
వీఎన్ పల్లె	31	12,223	12,938	1	25,162
పెండ్లిమర్రి	44	17,847	17,882	4	35,733
సీకే దిన్నె	53	23,959	24,746	4	48,709
మొత్తం	251	99,851	1,04,284	34	2,04,169

■ పోలింగ్ కేంద్రాల వద్ద చలువ పందిళ్లు, తాగునీరు సిద్ధం చేశామన్నారు. పురుషులు, మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల అవసరార్థం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

■ చెన్నూరు సీఐ పార్థసారథి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ప్రతి కేంద్రంలోనూ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

పెండ్లిమర్రిలో...

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని 19 గ్రామ పంచాయితీలలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 35,733 ఓటర్లకు గాను 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కమలాపురంలో ఆర్వో సమక్షంలో అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టారు.



పోలీసులకు సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్



కొండాయపల్లెలో సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రం



పెండ్లిమర్రి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్స్



కమలాపురంలో ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది

ఓటర్లు లిస్ట్‌లో పేరు ఉంటే ఓటు వేయవచ్చు



ఓటర్ స్లిప్పులు రాని ఓటర్లు ఆందోళన చెందవద్దు. ఓటరు జాబితాలో మీ పేరు ఉంటే చాలు. ఆధార్, రేషన్, అకౌంట్ బుక్, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులు తీసుకొని వెళ్లి ఓటు వేయవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాము. కరెంట్, ఫ్యాన్, తాగునీరు, మరుగుదొడ్లు, అవసరమైన చోట ర్యాంప్‌లు ఏర్పాటు చేశాం. ఓటర్లు, ఎన్నికల సిబ్బంది ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని వసతులు కల్పించాం. ఇప్పటికే మా సిబ్బంది ద్వారా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశాం.

– గణేష్ కుమార్, ఆర్‌ఓ, కమలాపురం నియోజకవర్గం

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



ప్రతి ఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించాం. సమస్యాత్మక కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశాం. రిగ్గింగ్, సైక్లింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వండి. తక్షణ చర్యలు తీసుకుంటాం.

– ఎన్. సుధాకర్, డీఎస్పీ, కమలాపురం నియోజకవర్గ నోడల్ అధికారి



కమలాపురంలో పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది



ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు తీసుకెళ్తున్న సిబ్బంది



కమలాపురం బీడీఓ కాలనీ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి

కడప నగరంలో..

ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. కడప నగరంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సందడి వాతావరణం కనిపించింది. ఆర్డీఓ మధుసూదన్‌రెడ్డి ఎన్నికల విధులలో పాల్గొననున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల సామగ్రితో సంబంధింత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలివెళ్లారు. సోమవారం ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు చేశారు.

– కడప సెవెన్‌రోడ్స్



ఎన్నికల సామగ్రితో కూడిన ట్రంకుపెట్టెలు



ఎన్నికల సామగ్రితో తరలి వెళుతున్న ఉద్యోగులు



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న సిబ్బంది



ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటుచేసిన మినీ బస్సులు

సర్కారు బడి.. వసతులతో మెరిసి..

రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో ఓ విప్లవం తెచ్చింది. మన బడి నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. పాఠశాలల్లో చేపట్టిన ఆధునీకరణ పనుల్లో కూడా బ్రాండెడ్ కంపెనీలకు చెందిన వస్తువులనే ఏర్పాటు చేశారు. దీంతో పాటు పాఠశాలల్లో నాడు- నేడు కింద 10 రకాల అభివృద్ధి పనులను చేసి ప్రభుత్వ పాఠశాలలను ఔరా అనిపించే స్థాయిలో తీర్చిదిద్దారు. గతంలో ఎన్నడూ ఇలా ప్రభుత్వ బడులను చూడలేదని.. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అంటున్నారు.

– కడప ఎడ్యుకేషన్



కళకళలాడుతున్న కడప జయనగర్ బాలికల హైస్కూల్

భగత్‌సింగ్‌కాలనీ పాఠశాలలో చెట్టుకు ఏర్పాటు చేసిన అరుగులు



జయనగర్ బాలికల హైస్కూల్లో రూపుదిద్దుకున్న అదనపు తరగతి గదులు



అత్యాధునిక బేషిన్లు, మరుగుదొడ్లు

వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి

కడప కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి పిలుపునిచ్చారు. ఆదివారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బుడగ జంగం కమ్యూనిటీని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం బేడ, బుడగ జంగం ప్రజలను గుర్తించి జగనన్న చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు వంటి అనేక రకాల సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. ఈ పథకాల వల్ల బుడగ జంగం ప్రజలు ఎంతో లబ్ధి పొందారన్నారు. బేడ, బుడగ జంగాల వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకుపోయామని, ఆయన సానుకూలంగా స్పందించి ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్లో ఆమోదించి బిల్లును కేంద్రానికి పంపించారన్నారు.

ఇన్ని విధాలుగా మేలు చేసిన వైఎస్ జగన్‌కు బుడగ జంగాలు అండగా నిలవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎంపీగా, అంజద్‌బాషాను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేడ, బుడగ జంగం నాయకులు కే. లక్ష్మమ్మయ్య, డి రాముడు సి వెంకటయ్య, పి ఆంజనేయులు, కే మంతయ్య, పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శంకరాచార్యుల విగ్రహానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం వేదపారాయణం, గణపతి, నవగ్రహ, ఉపదేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

1952 నుంచి 2019 వరకూ..

కమలాపురం రాజకీయ ముఖచిత్రం

వల్లూరు : కమలాపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కంటే ఆ పార్టీ వ్యతిరేక పార్టీలకే ప్రజలు ఎక్కువ సార్లు పట్టం కట్టారు. గత రికార్డులను పరిశీలిస్తే నియోజకవర్గంలో 1952 వ సంవత్సరం నుండి గత శాసన సభ ఎన్నికల వరకు మొత్తం 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే 1983 లో జరిగిన ఎన్నికల నుండి టీడీపీ రంగంలోకి వచ్చింది. అప్పటి నుండి 9 సార్లు ఎన్నికలు జరగగా అందులో టీడీపీ కేవలం 3 సార్లు మాత్రమే విజయం సాధించింది.

■ పార్టీ ప్రారంభంలో ఎన్టీఆర్ ప్రభంజనం కారణంగా 1983లో టీడీపీ అభ్యర్థి వీ. వెంకటరెడ్డి విజయం సాధించగా, 1994, 2004 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున పోటీ చేసిన జీ. వీర శివారెడ్డి గెలుపొందారు. మిగిలిన ఆరు సార్లు ప్రజలు టీడీపీని తిరస్కరించి నాన్ టీడీపీ పార్టీలకు పట్టం కట్టారు.

■ కాగా ప్రస్తుతం పోటీలో వున్న సీపీఐ 1952లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో మాత్రమే విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఎన్. శివరామిరెడ్డి గెలుపొందారు. తరువాత పలుసార్లు ఆ పార్టీ పోటీ చేసినప్పటికీ ప్రజలు తిరస్కరించారు.

■ మొత్తం 15 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 7 సార్లు విజయం సాధించింది. కాగా పార్టీ ఆవిర్భావం తరువాత ఎన్నికల్లో పోటీ చేసిన రెండు సార్లు వైఎస్ఆర్‌సీపీ విజయం సాధించింది. రెండు సార్లు కూడా ఆ పార్టీ అభ్యర్థి పీ. రవీంద్రనాథరెడ్డి టీడీపీపై విజయం సాధించారు.

■ 1955లో ఎన్. శంభురెడ్డి, 1962లో వీ. వెంకటరెడ్డి, 1972లో ఆర్. సీతారామయ్య, 1985, 1989, 1999లో డా. ఎంవీ మైసూరారెడ్డి, 2004లో జీ. వీర శివారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరుపున గెలుపొందారు.

■ 1967 లో ఎన్. పుల్లారెడ్డి, 1978 లో పేర్ల శివారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బరిలో నిలిచి విజయం సాధించారు.

– ప్రస్తుతం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తిరిగి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో వున్నారు. టీడీపీ తరుపున పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి, సీపీఐ తరుపున గాలి చంద్ర పోటీలో వున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వున్న పరిస్థితులను బట్టి ఈ ఎన్నికల్లో కూడా మరో మారు టీడీపీకి భంగపాటు తప్పదని, వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డి వరుసగా మూడవ సారి విజయం సాధించడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.